APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | ఆదివారం | 08 - 06 - 2025 | సంపుటి : 15 | సంచిక : 303 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



వచ్చే ఐదురోజులు వానలేవానలు

2 లో..



నేటినుంచి రెండ్రోజులు చేపమందు

2 లో..

# విచారణకు పోతా.. మొత్తం చెప్తా!



- కాళేశ్వరంపై భయపడేది లేదన్న హరీశ్‌రావు
- విచారణకు హాజరవుతానని తన్నీరు స్పష్టీకరణ
- కమిషన్‌కు అన్ని వాస్తవాలు వివరిస్తానని వెల్లడి
- కాళేశ్వరం ద్వారా లక్ష ఎకరాలకు పైగా సాగునీరు
- నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది
- విచారణకు వెళ్లడం ద్వారా నిజాలు నిరూపిస్తా
- మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు వెల్లడి
- తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**హైదరాబాద్- నీలగిరివార్త :**

కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతానని కాళేశ్వరం కమిషన్ విచారణపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం కమిషన్‌కు తాము భయపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డికి ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ ముందు వాస్తవాలను ఉంచుతామని చెప్పారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తామని తెలిపారు. బీజేపీకి ఎన్డీఎస్ఏ జేబు సంస్థలా మారిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కల్పతరువని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశామన్నారు. తెలంగాణభవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిడ్‌మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లుతెచ్చి, అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడిందని తెలిపారు. ఇది వాస్తవమైన రిపోర్టు అని, నీటి

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ రైతాంగానికి కెసిఆర్ శ్రీరామరక్ష

- రైతు ప్రయోజనాలు కాపాడేది బిఆర్ఎస్ మాత్రమే
- కాంగ్రెస్, బిజెపిలు గోదావరి, కృష్ణ దోపిడీలపై మాట్లాడరు
- కాళేశ్వరంపై కావాలనే పదేపదే అబద్దాల ప్రచారం
- మాజీమంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్ :**

గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. నీళ్ల విషయంలో సీఎం, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు

మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరం విచారణలో సరికొత్త ట్విస్ట్!

### తుమ్మల నాగేశ్వరరావును ఈటల ఇరికించారా?



- ప్రాజెక్టు స్థల మార్పు నిర్ణయంలో తుమ్మల భాగస్వామ్యం!
- హరీశ్, కేసీఆర్ చెప్పే జవాబులను బట్టి మరికొందరి పేర్లు తెరపైకి?
- మున్ముందు మరి కొందరిపై ఆరోపణలు వెలుగులోకి వచ్చే అవకాశం?
- కాళేశ్వరం కమిషన్ విచారణ ఎన్ని మలుపులు తిరుగుతుందో?
- విచారణ మరికొన్ని నెలలు పొడిగించే అవకాశం ఉందన్న అభిప్రాయం?

ఖమ్మం జిల్లా నుంచి దశాబ్దాలుగా వేర్వేరు క్యాబినెట్‌లలో తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. తొలుత టీడీపీ, ఆ తరువాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేసిన ఆయన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగారు కూడా! కాళేశ్వరం జ్యుడిషియల్ కమిషన్ విచారణ ప్రారంభించి మొదలు ఇప్పటి వరకు 14 నెలల వ్యవధిలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు ఎక్కడా విన్పించలేదు. కానీ శుక్రవారం మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన విచారణ సందర్భంగా కమిషన్ ముందు తుమ్మల పేరును ప్రస్తావించడం రాజకీయంగా సంచలనం రేపింది.

**చెన్నూరి అన్వేషి- (ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త) :**



2 లో..

## తెలంగాణ ఖజానా ఖాళీ!

- లోన్ కోసం వెయిటింగ్
- నిధుల లేమిలో ప్రభుత్వం
- కాగ్ నివేదికలో వాస్తవాలు
- గత ఏడాదితో పోలిస్తే అప్పులపై వడ్డీ భారం పెరుగుదల

**ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :**



తెలంగాణ ఆదాయవ్యయాలపై కాగ్ నివేదిక ప్రకారం ఏప్రిల్ ఆదాయం రూ16,473 శాలరీస్, పెన్షన్స్, అప్పులపై వడ్డీలు, కిస్తీలకే రూ12వేల కోట్లు జీతాలకు ఏకంగా రూ. 3968కోట్లు పెన్షన్ల కోసం రూ.1569 కోట్లు చెల్లింపులు, రుణాలపై వడ్డీలకు రూ.2200 కోట్లు, రుణ బకాయిలకు రూ.4వేల కోట్లు కొంత సొమ్ము కాంట్రాక్టర్లకు చెల్లింపులు, అభివద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేశారు. ఏప్రిల్‌లో అన్ని రకాలుగా కలిపి రూ 16,473 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో రూ.12 వేల కోట్లు జీతాలు, పెన్షన్లు, అప్పుల కిస్తీలు, వడ్డీల చెల్లింపులకే పోయాయి. మిగిలిన 4.5వేల కోట్ల ఆదాయంలో ఆసరా పెన్షన్లు, గ్రీన్‌చానెల్ కింద మంజూరు చేయాల్సిన ఇతర కొన్ని ముఖ్య పథకాలకు ఖర్చు చేయగా మరికొన్ని నిధులతో కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లించారు. దీంతో కొత్త పథకాలను ప్రకటించినా వాటిని అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఇబ్బంది పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఆర్థిక వివరాలు శుక్రవారం కాగ్ రిలీజ్ చేసిన నివేదికలో వెల్లడైన వాస్తవ పరిస్థితులు.

**గత ఏడాదితో పోలిస్తే వడ్డీ భారం పెరుగుదల**


గతేడాది ఏప్రిల్‌లో జీతాల కోసం రూ.3,847 కోట్లు ఖర్చు చేయగా, ఈసారి రూ.3,968 కోట్లకు పెరిగింది. పెన్షన్ల కోసం పోయినసారి రూ.1,335 కోట్లు ఖర్చు చేయగా, మొన్న ఏప్రిల్‌లో రూ.1,569.86 కోట్లకు చేరింది. మరోవైపు అప్పులపై వడ్డీలు కూడా అత్యంత వేగంగా పెరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో నెలకు సగటున రూ.1,900 కోట్ల వరకు చెల్లింపులు చేయగా ఈ ఏప్రిల్ నాటికి ఇది రూ.2,260 కోట్లకు ఎగబాకింది. వీటికి తోడు కిస్తీలకు ఈసారి ఏప్రిల్ నెలలో 4వేల కోట్ల రూపాయలపైనే చెల్లించారు. ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పులపై ఎక్కువగా

మిగతా 2వ పేజీలో..

## ఎవరో అదృష్టమంత్రులు!

- నేడే మంత్రివర్గ ప్రమాణస్వీకారం
- రాజ్‌భవన్‌లో ఏర్పాట్లకు ఆదేశాలు
- ముగ్గురు లేదా నలుగురు ప్రమాణం
- ఏయే వర్గాలకు ఛాన్స్ దక్కేది సస్పెన్స్

### కేబినేట్ విస్తరణకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్- నీలగిరివార్త :**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనుందని సమాచారం. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరు స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరకు పైగా కేబినెట్ విస్తరణ జరగలేదు. దీంతో కాంగ్రెస్‌పార్టీలో ఆశావాహుల సంఖ్య పెరిగింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానం చుట్టూ నేతలు తిరుగుతున్న పరిస్థితి. ఇటీవల మీనాక్షీ నటరాజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమెను కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు, ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. ఈ క్రమంలో నేడు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా రాజ్‌భవన్ వర్గాలను సీఎం కోరినట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణలో ముగ్గురికి చోటు దక్కే అవకాశం ఉందని,అయితే ఈ ముగ్గురు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది.మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీపడుతున్నారు.ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేబినెట్‌లో ప్రాధాన్యత లేదు. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు.ఈ క్రమంలో నేటి

మిగతా 2వ పేజీలో..




## సోనియాకు అస్వస్థత

- సిమ్లాలో ఐజీఎంసీ ఆస్పత్రికి తరలింపు
- ఆసుపత్రి ప్రాంగణంలో భద్రత కట్టుదిట్టం

**ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :**

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. సిమ్లాలో ప్రియాంకాగాంధీ కుటుంబంతో కలిసి వేసవి సెలవులు గడిపేందుకు వెళ్లిన సోనియా ఆరోగ్యం క్షిణించింది. దీంతో సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. సీనియర్ వైద్యులు సోనియాకు ఎమ్ఆర్ఐ పరీక్షలతోపాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సంఘటన తర్వాత, సిమ్లాలో రాజకీయ కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. హిమాచల్ ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ప్రబోధ్

మిగతా 2వ పేజీలో..



## మరో ఐదుగురు ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళలు సహ మృతి
- బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు
- కాల్పుల మోతతో దద్దరిల్లుతున్న దండకారణ్యం

**ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :**

ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య చోటు చేసుకున్న ఈ ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు మహిళా నేతలున్నట్లు సమాచారం.కాల్పుల అనంతరం ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్‌లోని దండ కారణ్యం గతకొన్ని రోజులుగా కాల్పుల మోతతో దద్దరిల్లుతోంది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ టార్గెట్‌గా ఈ ఆపరేషన్ జరుగుతోంది. శుక్రవారం నాటి


మిగతా 2వ పేజీలో..

## తెలుగు రాష్ట్రాల్లో విషాద ఘటనలు

- నదిలో గల్లంతయి ఏడుగురు యువకులు మృతి
- ఎపిలో ఒకరు, తెలంగాణలో ఆరుగురు మరణం

**అల్లూరు/భూపాలపల్లి :**

తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు చోట్ల రెండు విషాదాలు చోటుచేసుకున్నాయి.నదిలో ఈతకు వెళ్లిన యువకులు గల్లంతయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సీలేరు నదిలో సరదాగా నదీ స్నానానికి వెళ్లిన ఐదుగురు యువకులు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. అదే సమయంలో స్థానికులు గమనించి నదిలోకి యువకులను కాపాడేందుకు ప్రయత్నించారు. వీరిలో నలుగురు ఒడ్డుకు చేర్చగలిగారు కానీ,అభిలాష్ అనే యువకుడు మాత్రం గల్లంతయ్యాడు. చింతూరు మండలంలోని మోతుగూడెం సమీపంలో ఈ విషాదం సంభవించింది. నదిలో కొట్టుకుపోయిన యువకుడి ఆచూకీ కనిపెట్టేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇకపోతే అలాగే తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ ఆరుగురు నదీ స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజి ఎగువ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.గోదావరిలో స్నానానికి వెళ్లిన ఏడుగురు యువకులు ప్రమాదవశాత్తూ ప్రవాహ వేగానికి కొట్టుకుపోగా.. ఒకరు మాత్రమే సురక్షితంగా బయటపడిగలిగారు. గల్లంతైన వారిలో నలుగురు యువకులు అంబటిపల్లికి చెందినవారు కాగా మిగతా ఇద్దరు కొర్లకుంట గ్రామస్థులు. కాగా, అంబటిపల్లికి చెందిన నలుగురూ ఒకే కుటుంబానికి చెందినవారని సమాచారం. ప్రమాదఘటన గురించి తెలిసి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మహదేవపూర్ మండలం అంబటిపల్లి దగ్గరలో గల మేడిగడ్డ బ్యారేజీవద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, గల్లంతైన వారిలో అంబటిపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు పత్తి మధుసూదన్, పత్తి శివ మనోజ్, తొగరి రక్షిత్, కర్నాల సాగర్, ఉండగా.. కొర్లకుంట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులైన పండు, రాహుల్ గోదావరిలో సాయంత్రం స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నదిలో



మిగతా 2వ పేజీలో..



## బనకచర్లపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఎపి ప్రభుత్వం కేంద్రానికి డిపిఆర్ ఇచ్చింది
- సిఎం రేవంత్ కూడా జలవనరుల శాఖను కలవాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్- నీలగిరివార్త :**

బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల మీద కేంద్రం నిర్ణయం తీసుకోలేదని తేల్చి చెప్పారు. గోదావరి జలాల పంపిణీ మేరకు తెలంగాణకు అన్యాయం జరగవద్దని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరుతున్నాను.. ఎందుకు బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలనే దానిపై పూర్తి వివరాలతో జల వనరుల శాఖను కలవాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు వలన తెలంగాణకి ఏ విధంగా నష్టం జరుగుతోందో డీటెయిల్డ్ గా లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అయితే, గత వారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ ఇచ్చిందని అన్నారు. కేంద్రం ఇంకా ఆ రిపోర్ట్ పరిశీలించలేదు.. బనకచర్ల ప్రాజెక్ట్ రిపోర్ట్ చదవలేదు.అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటుంది. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని తెలిపారు.రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు ఎలిజిబిలిటీ వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. నేను మరోసారి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండను. సేవ్ తెలంగాణ నినాదంతో బీజేపీ ముందుకువెళ్తుంది. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తాం అన్నారు. బీజేపీ నేతగా ఈటల రాజేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్లలేదు. గత ఆర్థిక మంత్రిగా ఈటల విచారణకు వెళ్లారు. బీజేపీ స్టాండ్ చెప్పాలని కమిషన్ అడగలేదు.ఆర్థిక మంత్రిగా ఏం జరిగిందో ఈటల కమిషన్ ముందు వివరించారు. ఇక, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆల్ పార్టీ మంత్రి.. బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల లో మంత్రిగా పని చేశారని

మిగతా 2వ పేజీలో..



## రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల వేలం

- ఆదాయం కోసం సర్కార్ ఆమోదం

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు-, స్థలాలు విక్రయంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ఫ్లాట్లు బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ వీపీ గౌతం సిద్ధం చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20వ తేదీ నాటికి

మిగతా 2వ పేజీలో..

# తెలంగాణ కేబినేట్‌లో విజయశాంతికి చోటు?

- హైదరాబాద్‌లో జోరుగా ప్రచారం
- రాజగోపాల్ రెడ్డి, వివేక్ పేర్లు కూడా



**హైదరాబాద్- నీలగిరివార్త :** రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుం దనే విషయంలో అప్పుడూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గ్రేట ర్ హైదరాబాద్ ప్రాంతానికి చోటు దక్కే అవకాశాలు అధికంగా కనిపిస్తు న్నాయి. మంత్రివర్గ విస్తరణ జరుగనున్నదనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ విజయశాంతికి మంత్రి పదవి ఖాయం అనేది సర్వత్రా చర్చ మొదలైంది. అలాగే వివేక వెంకట్ స్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌లకు కూడా చోటు దక్కవచ్చని ప్రచారం సాగుతోంది. గతంలో గ్రేటర్ నుంచి రాష్ట్రమంత్రి వర్గంలో ప్రాతినిథ్యం ఉండేది. ప్రస్తుతం లేదు. అయితే, ఎన్నికల్లో గ్రేటర్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులెవరూ విజయం చేజిక్కించుకోలేదు. దీంతో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతానికి రాష్ట్ర క్యాబినేట్ దక్కలేదు. నామినేటెడ్ కేటగిరిలోనూ పలువురు ఎమ్మెల్సీలుగా నియమితుల య్యారు. అందులో విజయశాంతి ఒకరు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక.. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ప్రస్తుతం గ్రేటర్‌కు మంత్రి పదవి రావడం ఖాయమనేది, అందులో విజయశాంతి పేరు అధికంగా వినిపిస్తున్నది. ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేశారు. అధికారం వచ్చాక ఏమీ అడగలేదనీ, ఎమ్మెల్సీ పదవిని పిలిచి ఇచ్చారనేది టాక్ ఉన్నది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గం 11 మందితో ఉండగా అందులో ఇద్దరు మహిళలు కొండా సురేఖ, సీతక్కలకు మాత్రమే మంత్రి పదవి లభించింది. ఉన్న వారిలోనూ 1:3 గా చూసినా మరో మహిళకు మంత్రివర్గంలో చోటుకల్పించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనూ విజయశాంతికి మంత్రి పదవి లభించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు సినీరంగానికి చెందిన ఆమెకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల చలనచిత్ర పరిశ్రమ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే దిశగా ప్రయత్నం చేసినట్టుగా ఉంటుందనేది రాజకీయ వర్గాల్లోని అభిప్రాయం. ఇకపోతే వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల పేర్లుకూడా వినిపిస్తున్నాయి. రాహుల్ వీరిద్దరికీ హామీ ఇచ్చారని ప్రచారం. అయితే ఎవరెవరు అదృష్టవంతులో ఆదివారం ఉదయానికి తేలనుంది.

# నగరంలో కొత్తగా 65వేల ఆటోలకు అనుమతి

- ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు చోటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా కారణంగా వాహ నాల సంఖ్య కూడా రోజురోజుకు పెరు గుతూ వస్తోంది. దీంతో వాయు కాలు ష్యం నుంచి నగరాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పెట్రోల్, డీజిల్ లేని 65 వేల కొత్త త్రీ వీలర్ ఆటో రిక్షాలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగ రంలో కొంతకాలంగా కొత్త ఆటో రిక్షాలకు పరిమితి ఉంది. అయితే కొత్త ఆటో రిక్షాలకు పరిమిట్లు ఇవ్వడానికి లేదు. ఆ పరిమితిని సడలిస్తూ జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతి ఇస్తూ జీవో నెంబర్ 263 విడుదల చేసింది. నగరంలో జనాభా అపారమైన పెరుగుదల కారణంగా ఆటో రిక్షా పర్మిట్లకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ వాహనాలకు సంబంధించిన ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్ చేసి వాటి ఇంజిన్ను ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ లాగా మార్చుకోవడానికి 25 వేల వాహనాలకు అనుమతి ఇచ్చింది. అయితే ఇప్పటివరకు ఉన్న డీజిల్, పెట్రోల్ ఆటో రిక్షాల ట్రాన్స్‌ఫర్, డీజిల్, పెట్రోల్తో నడిచే కొత్త ఆటో రిక్షాలకు ఓఆర్ఆర్ పరిధిలో అనుమతించబడవు అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రజా రవాణాను మెరుగు పరుస్తూనే నగర కాలుష్యాన్ని తగ్గించవచ్చు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటోలకు పరిమిత సంఖ్యలో అనుమతిస్తూ రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసిందని, ఈ మేరకు ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటోలకు అనుమతిస్తూ జీవో 263 విడుదల చేసినట్లు-గా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఓఆర్ఆర్ లోపల కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్, 10 వేల ఎల్పీజీ ఆటోలకు అనుమతిస్తున్నామని వివరించారు. 10 వేల సీఎన్జీ ఆటోలకు అనుమతిస్తున్నామని వెల్లడించారు. 25 వేల డీజిల్, పెట్రోల్ ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్ చేయడానికి అనుమతిస్తు ఇస్తున్నట్లు- తెలిపారు. 25 వేల ఆటోలను ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీలుగా మార్చడానికి అనుమతిచ్చామన్నారు.

# మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నకారు

**ఇద్దరు వ్యక్తులు స్పాట్‌లోనే మృతి**

**హైదరాబాద్ :** మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదులాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..సైనిక్‌పురికి చెందిన వర్షిత్, కుంట్లూరుకు చెందిన భార్గవ్ యాదవ్, ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ప్రవీణ్, వైజాగ్‌కు చెందిన దినేష్ మిత్రులు. వీరు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనులు చేస్తున్నారు. శుక్రవారం ఎదులాబాద్ సమీపంలోని విహారి ఫామ్‌హౌస్‌లో విందు ఏర్పాటుచేసుకొని మరింత ఆహార పదార్థాల కోసం అర్ధరాత్రి సమయంలో నలుగురు ప్రయాణిస్తున్న కారు ఎదులాబాద్ నుండి మాదారం క్రాస్ వద్ద విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వర్షిత్, భార్గవ్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందగా కారు నడుపుతున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నామోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పరుశురాం తెలిపారు.

## ఎఐజి ఆస్పత్రిలో స్వల్ప అగ్నిప్రమాదం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో శనివారం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. అత్యవసర విభాగం వద్ద పార్కింగ్ చేసిన అంబులెన్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనం నుంచి బయటకు పొగలు వ్యాపించాయి. మంటలు వ్యాపించడంతో రోగులు, రోగుల బంధువులు భయాందోళనకు గురై అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలను గుర్తించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో అంబులెన్స్ పూర్తిగా దగ్ధమైంది.

## రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం

మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయి, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్ల ఫ్లాట్లతో పాటు, ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములు, మంచి అందుబాటులో ఉండే సరసమైన ధరలతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ కమిషనర్ గౌతం విజ్ఞప్తి చేశారు.

# కాళేశ్వరం విచారణలో సరికొత్త ట్విస్ట్!

- ప్రాజెక్టు స్థల మార్పు నిర్ణయంలో తుమ్మల భాగస్వామ్యం!
- హరీశ్, కేసీఆర్ చెప్పే జవాబులను బట్టి మరికొందరి పేర్లు తెరపైకి?
- మున్ముందు మరి కొందరిపై ఆరోపణలు వెలుగులోకి వచ్చే అవకాశం?
- కాళేశ్వరం కమిషన్ విచారణ ఎన్ని మలుపులు తిరుగుతుందో?
- విచారణ మరికొన్ని నెలలు పొడిగించే అవకాశం ఉందన్న అభిప్రాయం?

**చెన్నూరి అన్వేషి- (ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త) :**



ఖమ్మం జిల్లా నుంచి దశాబ్దాలుగా వేర్వేరు క్యాబినెట్‌లలో తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. తొలుత టీడీపీ, ఆ తరువాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేసిన ఆయన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగారు కూడా! కాళేశ్వరం జ్యుడిషియల్ కమిషన్ విచారణ ప్రారంభించి మొదలు ఇప్పటి వరకు 14 నెలల వ్యవధిలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు ఎక్కడా విన్పించలేదు. కానీ శుక్రవారం మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన విచారణ సందర్భంగా కమిషన్ ముందు తుమ్మల పేరును ప్రస్తావించడం రాజకీయంగా సంచలనం రేపింది. సబ్ కమిటీలో తాను, హరీశ్‌తోపాటు తుమ్మల నాగేశ్వరరావు కూడా ఉన్నారని ప్రస్తావన చేసిన నేపథ్యంలో తుమ్మలను కూడా జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణకు పిలుస్తుందా? కేసీఆర్ సర్కార్‌లోనూ మంత్రిగా ఉన్నందున వదిలేస్తారా? అనే చర్చ మొదలైంది. తెలంగాణ మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం బీఆర్ కేఆర్ భవన్ ఎనిమిదో అంతస్తులో ఉన్న కాళేశ్వరం జ్యుడిషియల్ కమిషన్ ముందు హాజరై తన వాదనలు వినిపించారు. కమిషన్ అడిగిన ప్రశ్నల్లో ఒక ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరును వెల్లడించారు. ఖమ్మం జిల్లా నుంచి దశాబ్దాలుగా వేర్వేరు క్యాబినెట్‌లలో తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. తొలుత టీడీపీ, ఆ తరువాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోఆర్అండ్ బీ మంత్రిగా పనిచేసిన ఆయన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగారు కూడా. కాళేశ్వరం ప్రాజెక్టు రీ డిజైన్ కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీలో అప్పటి మంత్రి టీ హరీశ్ రావు చైర్మన్‌గా ఉండగా, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నారు.

**ప్రాజెక్టు స్థల మార్పులో తుమ్మల హస్తం!**

అప్పట్లో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చడంలో ఈ కమిటీయే నిర్ణయం తీసుకున్నది. ఈయన నిర్ణయం ప్రకారమేఅప్పుడు మంత్రి మండలిలో చర్చించి కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారు. అయితే గత పద్నాలుగు నెలలుగా జరుగుతున్న విచారణలో ఎక్కడ కూడా తుమ్మల పేరు బహిర్గతం కాలేదు. ఈటల సమాధానం బట్టి జ్యుడిషియల్ కమిషన్ మున్ముందు తుమ్మలకు నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచే అవకాశాలపై చర్చలు నడుస్తున్నాయి. రీ డిజైన్‌లో ఆయన పాత్ర ఉన్నందున విచారణకు పిలిచే అంశాన్ని తోసిపుచ్చలేమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఐతే విచారణ తర్వాత తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బీ మహేష్ గౌడ్, ఎంపీ సీహెచ్ కిరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఈటలను తూర్పారబట్టారు బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న ఏదైనా డీల్ కుదిరిందా? అని అనుమానం కలుగుతోందన్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లినప్పుడు కేసీఆర్, హరీశ్‌పై పెద్ద పెద్ద డైలాగులు వేసిన ఆయన కమిషన్ ముందుకు వెళ్లగానే ఏమైందని నిలదీశారు. ఢిల్లీ బీజేపీ పెద్దల డైరెక్షన్ లో కేసీఆర్‌కుఈటల క్లీన్‌చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ విమర్శల నేపథ్యంలో మున్ముందు మరిన్ని ఆరోపణలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నందున విచారణ మరికొన్ని నెలలు పొడిగించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి హరీశ్, కేసీఆర్ చెప్పే సమాధానాల్ని బట్టి మరికొందరు పేర్లు మున్ముందు బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మొత్తానికి కాళేశ్వరం కమిషన్ విచారణ ఎన్ని మలుపులు తిరుగుతుందో? చెప్పలేని పరిస్థితి ఉందనే అభిప్రాయాలు రాజకీయ పరిశీలకుల నుండి వ్యక్తమవుతున్న నేపథ్యం.

# వచ్చే ఐదురోజులు వానలేవానలు

**వాతావరణ శాఖ చల్లటి కబురు**

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురిశాయి. ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేయడంతో.. మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రాగల ఐదు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య మహారాష్ట్ర నుంచి ఉత్తర ఇంటీరియర్ కర్నాటక, తెలంగాణ మీదుగా కోస్తా ఆంధ్ర వరకు సగటు సముద్రమట్టానికి 1.5కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ద్రోణి బలపడిందని పేర్కొంది. ఉత్తర ఇంటీరియర్ కర్నాటక, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 3.1కి.మీటర్ల ఎత్తుల ఉన్నఉపరితల ఆవర్తనం బలహీనపడిందని తెలిపింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్,నిర్మల్, నిజామాబాద్,జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే ఐదు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

# నేటినుంచి రెండ్రోజులు చేపమందు

**నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు**

**హైదరాబాద్ :** బత్తిన సోదరుల ఆధ్వర్యంలో నేటి నుంచి చేప మందును పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మృగశిరకార్తె సందర్భంగా ఈ కర్యక్రమం ఏటా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు ఈ మందును పంపిణీ చేసేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి చేప ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు 32 కౌంటర్లను ఏర్పాటు చేశారు. మృగశిర కార్తె సందర్భంగా ఉబ్బసం వ్యాధిగ్రస్తుల కోసం ప్రతి యేటా బత్తిని కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించే చేప మందు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించేందుకు జిహెచ్ఎంసి, మత్యశాఖ, ఆర్ అండ్ బి, వాటర్ వర్క్, విద్యుత్, పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో చేప మందు కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు. చేపమందు కోసం వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే అస్తమా రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చేపమందు కోసం లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున లా అండ్ ఆర్డర్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. చేప మందు పంపిణీ కోసం లక్షన్నర చేప పిల్లలను అందుబాటులో ఉంచనున్నట్లు- మత్యశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే, ఐదు లక్షల మంది చేపమందు చేసుకునేందుకు రావచ్చని, ఇందు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు బత్తిన సోదరులు,అధికారవర్గాలు పేర్కొంటున్నారు. వందలాది మంది ఉత్తర భారతీయులు చేప మందు కోసం 2 రోజుల ముందుగానే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుని, చేపమందు కోసం ఏర్పాటు చేసిన షెడ్లలో సేద తీరుతున్నారు. దీంతో వివిధ స్వచ్ఛంధ సంస్థలు ఇతర రాష్ట్రాల నుండి చేప మందు కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలివచ్చిన అస్తమా రోగులు, వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పిస్తున్నాయి. మొత్తం 32 కౌంటర్ల ద్వారా చేపమందు పంపిణీకి సన్నాహాలు చేస్తుండగా, మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూ లైన్‌లు ఏర్పాటు చేసి, వృద్ధులు, వికలాంగులు, చిన్నారులతో పాటు విఐపిలకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా చేపమందు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. చేపమందు పంపిణీ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ నిర్వహణ కోసం 3 షిఫ్టుల్లో 300 మంది పారిశుద్ధ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి షిఫ్టుకు 100 మంది పారిశుద్ధ సిబ్బందితో నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించనుండగా, జలమండలి అ ధికారులు లక్షలాది మంచినీటి ప్యాకెట్ల పంపిణీ కోసం ఏర్పాట్లు చేశారు. అన్ని ప్రధాన ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

# విచారణకు పోతా.. మొత్తం చెప్తా!

మొదటి పేజీ తరువాయి

పారుదలశాఖ అధికారులిస్తున్న నివేదిక అని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కిలోమీటర్లు తెలంగాణలోనే ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే. తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు. ప్రాణహిత-చేవెళ్ల నీటి నిల్వ సామర్థం కేవలం 11 టీఎంసీలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం 141 టీ-ఎంసీలు.. రెండింటి మధ్య ఎంత తేడా.. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు. అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు. ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో రూ.20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు. నేను లెక్కలన్నీ తీయిస్తే కాంగ్రెస్ ఖర్చు చేసింది రూ.3700 కోట్లు మాత్రమేనని తేలింది. ఎందుకీ గోబెల్స్ ప్రచారం?. ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని దుష్ప్రచారం చేస్తున్నరు ఈ కాంగ్రెస్ నాయకులు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా వీళ్లే. ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు రూ.40,300 కోట్లకు పెంచారు ఇదే కాంగ్రెస్ నాయకులు. ఇదీ వీళ్ల నిర్వాకం అని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు వెళ్తామని హరీశ్ రావు చెప్పారు. ఇక్కడ ఎవరూ భయపడడం లేదని తెలిపారు. తమకేం భయం లేదని, బాజాప్తా విచారణకు హాజరవుతామని స్పష్టం చేశారు.

# తెలంగాణ రైతాంగానికి కెసిఆర్ శ్రీరామరక్ష

మొదటి పేజీ తరువాయి

పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈమూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటి బొట్టు-ను ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కార నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్‌రావు వివరంగా సమాచారం అందిస్తారు. గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్‌డీఎస్‌ఏ పోదు, ఏజెన్సీ పోదు. ఆ 140 మంది చావులకు ఫలానావాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదు. బీహార్‌లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడు. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రి-టైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు నష్టం జరిగితే ఎన్‌డీఎస్‌ఏ రాదు, ఎవడు రాడు. అలానే అవినీతి, కమిషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరు.ఎవరూ బాధ్యత తీసుకునేవారు లేరు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే దాని గురించి మాట్లాడే వాళ్ళు లేరు, పెద్దవాగు ప్రాజెక్ట్ రెండుసార్లు కొట్టుకు పోయినా అడిగేవాడు లేడు. కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్లు ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్తబుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికిరాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికిరానిదైతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించావని రేవంత్ రెడ్డిని అడుగుతున్నా. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసు. వాస్తవాలు తెలియజెప్పడానికి, కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై నీళ్లిచ్చిన కేసీఆర్ మీద, నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్ ప్రభుత్వంపైన అభాండాలు వేసే ప్రయత్నం చేస్తున్నారని, కానీ ప్రజలకు వాస్తవాలు తెలుసునని అన్నారు.

# తెలంగాణ ఖజానా ఖాళీ!

మొదటి పేజీ తరువాయి

ఆధారపడుతోంది. ఏడాదిలో 5,230 కోట్లకు చేరిన అప్పులు 2024 ఏప్రిల్‌లో రూ.2,246 కోట్లు అప్పులు చేయగా ఈసారి ఇది రూ.5,230 కోట్లకు పెరిగింది. అదే సమయంలో, మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) తగ్గుముఖం పట్టింది. పోయినేడాది ఏప్రిల్‌లో రూ.3,119 కోట్ల మూలధన వ్యయం ఉండగా, మొన్నటి ఏప్రిల్‌లో ఇది రూ. 1,204 కోట్లకు తగ్గింది. మూలధన వ్యయం తగ్గడం అంటే మౌలిక సదుపాయాల కల్పన, దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులు తగ్గిపోవడమేనని, ఇది భవిష్యత్ ఆర్థిక వృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆదాయం పెరిగినా ట్యాక్స్ రాబడి డౌన్‌ఓవరాల్‌గా పోయిన ఏడాది ఏప్రిల్ నెలలో వచ్చిన ఆదాయం ఈ సారి ఏప్రిల్‌తో చూస్తే రూ.2 వేల కోట్ల పైనే పెరిగింది. కానీ, ఇందులో పన్నుల ఆదాయం రూ.600 కోట్లు పడిపోయింది. అయితే, అప్పులు ఎక్కువగా తీసుకోవడంతో మొత్తం ఆదాయం పెరిగిందని సాధారణంగా గతంతో చూస్తే కొంత రాబడి పూర్తిగా తగ్గినట్టేనని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఎవరో అదృష్టమంత్రులు!

మొదటి పేజీ తరువాయి

కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఓసీ సామాజిక వర్గానికి లేకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే కసరత్తు చేసిన పేర్లను పార్టీ అధిష్ఠానానికి నివేదించినట్టు తెలుస్తోంది. ఈరోజు రాత్రికి లేదా రేపు ఉదయానికి పేర్లపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు గవర్నర్ జిష్ణుదేవ్ శర్మకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నాలుగైదు ముహూర్తాలు ఖరారు చేసినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పేర్లు నిర్ధరణ అయ్యాక ఏ ముహూర్తంలో ప్రమాణస్వీకారం ఉంటుందో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పార్టీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్య క్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు దఫాలుగా చర్చించారు.

# మరో ఐదుగురు ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి

ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మావోయిస్టు అగ్రనేత భాస్కర్ మృతి చెందిన విశయం తెలిసిందే! భాస్కర్‌పై రూ.25లక్షల రివార్డ్ ఉంది. ప్రస్తుతం ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని భద్రతా బలగాలు వెల్లడించాయి.

# తెలుగు రాష్ట్రాల్లో విషాద ఘటనలు

మొదటి పేజీ తరువాయి

పడి గల్లంతు అయ్యారు. కాగా, విషయం తెలుసుకున్న మహాదేవపూర్ ఎస్ఐ పవన్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. గల్లంతమైన యువకుల కొరకు గాలింపు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఇక, మేడిగడ్డ ఘటనపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అధికారులకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

# బనకచర్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

మొదటి పేజీ తరువాయి

కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో గత 11 ఏళ్లుగా సుపరిపాలన సాగుతోందని, అందుకే యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా వివరించాలని, వ్యతిరేక ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణకు కేంద్రం అన్ని రంగాల్లో నిధులిచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల చేతుల్లో వందల మంది చనిపోతే గతంలో కాంగ్రెస్ స్పందించలేదు. ఉగ్రవాదులు పర్యాటకులను చంపితే 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేశాం. తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించే పార్టీ భాజపా. కాంగ్రెస్, భారాసలు ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# సోనియాకు అస్వస్థత

మొదటి పేజీ తరువాయి

సక్సేనా స్వయంగా ఐజిఎంసికి చేరుకుని సోనియా గాంధీ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. దీనితో పాటు, రాష్ట్ర ఆరోగ్య మంత్రి కూడా ఆసుపత్రికి చేరుకుని నేరుగా రేడియాలజీ విభాగానికి వెళ్లారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు కూడా తన రెండు రోజుల ఉనా పర్యటనను రద్దు చేసుకుని సిమ్లాకు బయలుదేరారు. సోనియా గాంధీ సంరక్షణ కోసం అవసరమైన ప్రతి వైద్యస దుపాయాన్ని అందుబాటులో ఉంచినట్లు ఆసుపత్రి వర్గాల తెలిపాయి. మరోవైపు ఆసుపత్రి ప్రాంగణంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. వీవీఐపీల కదలిక కారణంగా సాధారణ ప్రజల కదలికలపై ఆంక్షలు విధించారు. కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు ప్రస్తుతం సోనియా ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని పరిశీలిస్తే, ఐజిఎంసి వైద్యుల ప్రత్యేక బృందం సోనియా గాంధీని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఆమె ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ త్వరలో అందే అవకాశం ఉంది.

## మాకూ కేబినేట్‌లో చోటివ్వండి

**హైదరాబాద్ :** మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశంకల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పలువురు మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు కలిశారు. మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. వీరు ఇంతకు ముందే ఢిల్లీలో ఏఐసీసీ నేతలను కూడా కలిసి మంత్రివర్గంలో ఎస్సీ మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని విన్నవించారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com

నీలగిరి వార్త

తెలుగు దిన పత్రిక

మన కోసం మన వార్త

తెలంగాణ ఉమ్మడి జిల్లాలు

ఆదివారం 8-6-2025





# కాంక్రీట్ కుప్పలో మృతదేహం!

### పెందుర్తి మండలంలో దారుణం!



పెందుర్తి నీలగిరి వార్త ప్రతినిధి

పెందుర్తి మండలంలో దారుణం చోటుచేసుకుంది. కాలనీ నిర్మాణానికి ఉంచిన కాంకేట్ తిక్క కుప్పల్లో మృతదేహం లభ్యమయింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ముదపాక జగనన్నకాలనీలోఇంటి నిర్మాణం కోసం వేసిన కాంక్రీట్ పిక్క కుప్పలో వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది.జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కాంక్రీట్ పిక్క కుప్పలో మృతదేహం లభ్యం కాగ ఘటనా స్థలం చేరుకున్న పెందుర్తి పోలీసులు క్లూస్ టీం చేరుకున్నారు.మృతుడు విజయనగరం జిల్లా నల్లబంద గ్రామానికి చెందిన పక్కి సూరి (50) గా స్థానికులు గుర్తించారు.సూరి గత మూడు రోజుల నుండి కనబడలేదని స్థానికులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శనివారం కాంక్రీట్ పిక్క కుప్ప నుండి దుర్వాసన రావడంతో స్థానికులు జెసిబి ద్వారా పిక్క పై భాగాన్ని తొలగించగా మృతదేహం కనిపించింది.సమాచారం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకని ఆధారలు సేకరిస్తున్నారు.కాంక్రీట్ పిక్క మీద రాత్రి సమయంలో వ్యక్తి పడుకొని ఉంటుండగా లారీతో వెనుక నుండి పిక్కని అన్లోడ్ చేసి ఉండొచ్చనీ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఎన్.ఎమ్.ఎమ్.ఎస్,షైనింగ్ అవార్డులలో ప్రతిభ చూపిన విద్యార్థులు




చీడికాడ నీలగిరి వార్త ప్రతినిధి

మండలంలోని మంచాల ఆదర్శ పాఠశాలలో నలుగురు విద్యార్థులు. ఎన్.ఎం.ఎం.ఎస్ షైనింగ్ లో సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. ఆదర్శ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న రొంగలి ప్రశాంతి, గెంజి రెస్మా శ్రీ, పట్నాల వంశీ, బొబ్బిలి లోకేష్, ఎన్.ఎన్.ఎమ్.ఎస్. పరీక్షలో అర్హత సాధించారన్నారు.వీరికి సంవత్సరానికి పన్నెండు వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు ఉపకార వేతనం లభిస్తుందని ఆమె తెలిపారు.ఇక పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన కొల్ల శేఖర్,పాలకుర్తి లహరి,షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక అయ్యారన్నారు.వీరికి సోమవారం (9-06-2025) అనకాపల్లి జిల్లా కేంద్రంలో బహుమతి ప్రధానోత్సవంలో కలెక్టర్,మంత్రి చేతుల మీదుగా మెడల్,ప్రశంసాపత్రం, 20,000 నగదు అందజేయనున్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్,పాఠశాల సిబ్బంది అభినందించారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలో కమలా విద్యార్థుల మార్కుల ప్రభంజనం





KAMALA JUNIOR COLLEGE

మార్కాపురంనీలగిరి వార్త జూన్ 7వ తారీకు ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున:

నేడు ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ ఫలితాలలో కమలా జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని కమలా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చేసు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎం పి సి విభాగంలో దేవండ్ల అశోక్ 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి పట్టణంలో మొదటి స్థానం సాధించారని, గర్రే నిశ్చల 464, షేక్ సబిహా 464, %ఌ%.జ్యోత్స్న 464, సయ్యద్ మహమ్మద్ ఫయాజ్ 464 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎం రామ కుసుమిత 463 గాయం స్వప్న 462, ఆర్ జ్యోత్స్న 462, సయ్యర్ అర్సియా భాను 461, టీ అక్షయ సాయి 460 సాధించారు. బై పి సి విజాగం నందు షేక్ షాహిన్ 440 మార్కులకు గాను 435 మార్కులతో మొదటి స్థానం, అంగాల ప్రైస్కిల్ల 432 మార్కులతో ద్వితీయ స్థానం, సి ఈ సి విభాగం. నందు 500 మార్కులకు కనమర్లపూడి అనులేఖ 477 మార్కులు సాధించి పట్టణంలో మొదటి స్థానం, బాసాని జ్యోత్స్న శృతి 462 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు. మా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత సాధించారని విద్యార్థులకు, అధ్యాపకులకు కళాశాల సెక్రటరీ పెనుగొండ పవన్ కుమార్ ప్రిన్సిపాల్ దేసు సుధాకర్, బోధన సిబ్బందికి, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వెలుగు సిబ్బంది సమర్థవంతంగా విధులునిర్వహించాలి

### - శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



మార్కాపురం నీలగిరి వార్త ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున :

శనివారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల వెలుగు సిబ్బంది, వి ఓ ఏ లు, తెలుగుదేశం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలుగు సిబ్బంది వీవోఏ లు తెలుగుదేశం నాయకులు సమైక్యంగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం వివో ఏ లు జగన్ పాలన అంతమై ఏడాది పూర్తి అయిన సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చేత కేక్ కట్ చేయించి మిఠాయిలు అందరికీ పంచిపెట్టారు.

# ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలి

### జిల్లా విద్యా శాఖ అధికారి అప్పారావు నాయుడు

అనకాపల్లి నీలగిరి వార్త ప్రతినిధి

ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో ఉదయం ఏడు గంటలకు జిల్లా విద్యా శాఖ సిబ్బంది మరియు ఉపాధ్యాయ సంఘాల తో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యోగా ప్రదర్శన లో యోగ గురువు దొరమ్మ నాయుడు, బి అప్పారావు లు ఈ కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ కూడా చేసి చూపించి అందరితో చేయించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ రోజు క్రమం తప్పకుండ యోగా సాధన చేస్తే మన ఆరోగ్యం అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. యోగ ప్రాధాన్యతను ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు మనం పాఠశాలలో నిర్వహించే ప్రార్థన, డ్రిల్ కార్యక్రమాల్లో యోగా ప్రయోజనాల గురించి విద్యార్థులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఇందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆధ్వర్యంలో జరుగు







తున్న యోగాంధ్ర -2025 కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ కూడా పూర్తిస్థాయిలో పాల్గొనడం హర్షనీయమన్నారు. జిల్లా పరిధిలోని అన్ని విభాగాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ యోగా అవగాహనా కార్యక్రమాల్లో మన యోగాంధ్ర రాష్టం తొలి స్థానంలో ముందంజలో ఉంటే, రాష్ట్రంలో మన అనకాపల్లి జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లా ఆయుష్మాన్ అధికారిని డాక్టర్ కె లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేసిన ట్లయితే అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. రాబోయే జూన్ 21 వ తారీఖున విశాఖపట్నంలో జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కి అందరూ సమాయత్తం కావాలని ప్రతి ఒక్కరితో యోగా యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి చిన్న నాలుగు రోడ్లు కూడలి వరకు నిర్వహించి యోగాంధ్ర పై ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డి ఎస్ డి ఓ రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, మహా లక్ష్మి నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆయుష్, యోగా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# మాటూరు గ్రామంలో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా!?



### కొండల్ని పిండి చేస్తున్న స్పందించని యంత్రాంగం

### అనధికారిక మాఫియా పై చర్యలు తీసుకునే అధికారులే లేరా

అనకాపల్లి నీలగిరి వార్త ప్రతినిధి

అనకాపల్లి మండలం మార్టూరు సర్వేనెంబర్1లో యదేచ్ఛగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులుస్పందించక పోవడం విచారకరం, గ్రామస్తులు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన రెవెన్యూ శాఖ గాని ఇటు మైనింగ్ శాఖ గాని ఎటువంటి చర్యలు తీసుకోపోగా అక్రమం మైనింగ్ కార్యకలాపాల సాగిస్తున్న వారికి అండగా నిలబడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ మాటూరు గ్రామస్తుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కొంతమంది కూటమి నాయకులు ప్రోత్సలంతో ఈ అక్రమ మైనింగ్ కార్యకలాపాలు సాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మైనింగ్ అధికారులు చొరవ తీసుకొని అక్రమ మైనింగ్ కార్యకలపాలు సాగిస్తున్న ఇటువంటి వారిపై చర్య తీసుకుని పునరావృత్తం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# అవినీతికి తావులేకుండా లేకుండా వైద్య సేవలు అందించాలి



### జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, నీలగిరి వార్తా ప్రతినిధి

జిల్లా కేంద్ర ఎన్టీఆర్ ఆసుపత్రిలో అవినీతి కి తవులేకుండా ప్రజలకు వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కేంద్ర ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి అనకాపల్లి శాసనసభ్యులు కొణతల రామకృష్ణ కో చైర్ పర్సన్‌గా పాల్గొన్నారు. కలెక్టర్, శాసనసభ్యులు సమక్షంలో హాస్పటిల్ అభివృద్ధి కొరకు ఐదుగురు డైరెక్టర్లను మరియు ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికకాబడిన ఐదుగురు డైరెక్టర్లకు ఆసుపత్రి లో ఉన్న వివిధ విభాగాలకు పర్యవేక్షకులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కొరకు అందరు కలిసికట్టుగాపని చెయ్యాలని, హాస్పిటల్‌లో ఎక్కడ అవినీతికి తావులేకుండా ప్రజలకు వైద్య సేవలు అందజేయాలని వైద్య అధికారులను ఆదేశించారు, గర్భిణీలకు చిన్నపిల్లలకు హాస్పటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందిచలని మరియు సర్జికల్, గైనిక్, చైల్డ్ హెల్త్ సర్వీసెస్ మరియు ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అనకాపల్లి శాసనభ్యులు కొణతల రామకృష్ణ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. బాలాజీ , జిల్లా ఆసుపత్రిల సమన్వయ కర్త శ్రీనివాసరావు, ఎన్.ట్.ఆర్. వైద్యశాల సూపరింటెండెంటే డాక్టర్ కృష్ణ రావు, సిబ్బంది పాల్గన్నారు.

# ప్రతిభ అవార్డుకు ఎంపికైన వేశపోగు జోషిత

పెద్దారవీడు, జూన్ 7, నీలగిరి వార్త ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున :



పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025 పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన పెద్దారవీడు గ్రామానికి చెందిన వేశపోగు పురుషోత్తం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రథమ కుమార్తె జోషిత 559 మార్కులు రావడంతో ప్రతిభ అవార్డుతో పాటు 20 వేల రూపాయలు ప్రైజ్ మనీకి ఎన్నికైనట్లు మండల విద్యా శాఖ అధికారి పి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు అభినందనలు తెలిపారు.

# మహిళల్ని అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం

### ఐటీ మంత్రి నారా లోకేష్

అమరావతి నీలగిరి వార్త ప్రతినిధి



మహిళల్ని అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం

-నారా లోకేష్

మహిళలను అవమానించిన వారు కాల గర్భంలో కలిసిపోక తప్పదని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.జగన్ రెడ్డి ! మహిళలను ఇంత ఘోరంగా మీ మీడియా సాక్షిలో అవమానించవచ్చా? అమ్మల ఆత్మాభిమానం మీద, అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం మీ దిగజారుడుతనానికి పరాకాష్ట! ఆకాశంపై ఉమ్మేయాలనుకుంటే, అది మీ మీదే పడుతుంది. అమరావతిపై విషం చిమ్మాలనుకుంటే అది మీ తాడేపల్లి ప్యాలెస్‌లో పడుతుంది. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే! భూములను త్యాగాలు చేసిన అమ్మల అమ రావతి. మూడు రాజధానుల కపట కుట్ర పొత్తిళ్లలో తంతుంటే, జై అమరావతి అని నినదించిన శాంతమూర్తుల పవిత్ర భూమి మన రాజధాని. జగన్ అనే సైతాన్‌ను తరిమేసిన అన్ని మతాల దేవతలు, దేవుళ్లు కొలువైన రాజధాని అమరావతి. కన్నతల్లిని, సొంత చెల్లిని తరిమేసిన దుర్మార్గుడికి మహిళల త్యాగాలు, గొప్ప తనం ఏం తెలుస్తుంది?మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను అల్లరి చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా వారికి అదే చివరి రోజు అని మా ముఖ్యమంత్రి చంద్రబాబు గారు పదేపదే హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే మహిళలను గౌరవించేలా పాఠాలు బోధిస్తున్నాం. మహిళల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తున్నాం. అమరావతిపై విషం చిమ్మేందుకు జన్మనిచ్చిన అమ్మలను, జన్మంతా మనతో నడిచిన మహిళా లోకాన్ని కించపరిచిన జగన్ రెడ్డి గారి గ్యాంగ్‌ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించం. మహిళలను కించపరిచేలా చీర, గాజులు పెడతాం.. ఆడపిల్లలా ఏడొద్దు, మేమేమి గాజులు తొడుక్కోలేదు.. వంటి మాటలు ఎవ్వరు మాట్లాడినా కూటమి ప్రభుత్వం ఊరుకోదు. రాష్ట్ర మహిళల్ని అవమానపరుస్తూ క్షమించరాని నేరానికి పాల్పడిన జగన్ రెడ్డి బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ కోరాలి. లేకపోతే రాష్ట్రంలో మహిళలని హింసించే మందుల్లేని మహమ్మారితో బాధపడుతున్న జగన్ మాయ రోగం పూర్తిగా నయం చేస్తాం. దేవతల రాజధాని అమరావతి.. దెయ్యం జగన్ పనిపడుతుందన్నారు.

# గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



నీలగిరి వార్త నారాయణఖేడ్ జూన్ 7 :

నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులో గల గిరిజన గురుకుల కళాశాల లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంకు ఈ నెల10 తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ %=%.యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, నారాయణఖేడ్ నందు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో %వీూజ, ధీూజ% గ్రూపులలో మిగిలిపోయిన సీట్ల లో ప్రవేశము కొరకు 2024-25 విద్యా సంవత్సరము పదవ తరగతి లో ఉత్తీర్ణత పొందిన బాలురకు తేదీ.10.06.2025 ఉదయం 10.00 గంటలకు(గురుకుల కళాశాల) %+ఽౌఖ=-జీజ దీూ% నారాయణఖేడ్ లో గల పాఠశాల/కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించబడును. అట్టి కౌన్సిలింగ్ కు హాజరగు విద్యార్థులు 1.బదిలీ ధృవీకరణ పత్రము. 2. పదవ తరగతిలో సాధించిన మార్కుల మెమో (2024-25), 3. స్టడీ మరియు కండక్ట్ సర్టిఫికేట్. 4. కుల ధృవీకరణ పత్రము, 5. ఆదాయ ధృవీకరణ పత్రము (2025-26, గ్రామీణ ప్రాంతమునకు సంబంధించిన వారు రూ.1,50,000/-మరియు పట్టణ ప్రాంతమునకు సంబంధించిన వారు రూ.2,00,000/- కు మించరాదు). 6. ఆధార్ జిరాక్స్ మరియు స్పోర్ట్స్, అర్ఫాన్, %ూఎజ% ధృవీకరణ పత్రములు, 3 కలర్ ఫోటోలు, రెండు జతల నకలు కాపీలుతో హాజరు కాగలరని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ పాఠశాల/కళాశాల , నారాయణఖేడ్ ప్రిన్సిపల్ శ్రీ %=%. యాదగిరి తెలిపారు. %వీూజ, ధీూజ% గ్రూపులలో మిగిలిపోయిన సీట్ల యందు ప్రవేశం పొందగోరే బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# రేషన్‌కు బదులు నగదు వద్దు! రేషనే ముద్దు

దేవరాపల్లి నీలగిరి వార్త ప్రతినిధి



ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో రేషన్ కు బదులు నగదు బదిలీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించు కోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు డి వెంకన్న డిమాండ్ చేసారు, శనివారం ఆయన విడుదల చేసిన రక్తంలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. పిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయవలసి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం,పదే పదే రేషన్ అవసరం లెక పోతే డబ్బులు తీసు కోవచ్చనని పేదలను రేషన్ లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉంద న్నారు ఇప్పటికే సంవరానకి మూడు గ్యాస్ సిలిండర్లు తొంభై శాతం మందికి నగదు పడటం లెదన్నారు. నగదు బదిలీ అమలు జరిగితే రాష్ట్ర అర్థిక పరిస్థితులు బాగలేదని ప్రజాపంపిణీ వ్యవస్తను పూర్తి నిర్వీర్యం చేయాలని చూస్తుందని తెలిపారు ,కేరళ రాష్ట్రం తరహాలో మూడు కార్డుల విధానం అమలు చేయాలన్నారు. అక్కడ ఇస్తున్న విధంగా లబ్ధిదారులకు పదిహేడు రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు.రేషన్ మాఫియాకు ప్రధానంగా అదికార పార్టిలకు చేందిన నాయకులె మూల కారకులని తెలిపారు ఇది కప్పి పచ్చుకోవడం కోసమే ఈదాదులకు,పాల్పుడుతున్నారని తెలిపారు మండలానికో ఏజెంట్ను నియ మించుకుని రేషన్ బియ్యాన్ని సేకరించి,రీసైక్లింగ్, పాల్పడుతున్నారని తెలిపారు .గతంలో వామ పక్ష పార్టీలు చేసిన పోరాటాల ఫలితంగా 1955 లో దేశంలో పిడిఎస్ వ్యవస్థను ప్రవేశ పెట్టార న్నారు. ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి సమాజంలో జీవిస్తున్నారని తెలి పారు.అసమానతలు నిర్మూలించనంత వరకు రేషన్ పంపిణీని కొనసాగించ వలసిం దేనని డిమాండ్ చేసారు రేషన్ పంపిణీని,నిర్వీర్యం చేసే క్రమంలో నగదు బదిలీకి కేంద్రంలో బిజెపి, ప్రభుత్వం,పూనుకుంటుందన్నారు పిడియస్ లో రేషన్ కు బదులు నగదు బదిలీ ఆలోచనను విరమించు కోవాలని, 2013 ఆహార భద్రతా చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని,రేషన్ అందని సుదీర్ఘమైన గ్రామాలకు గిరిజన గ్రామాలకు పేదలకు ఎం డి యు వ్యవస్థను కొనసాగించి రేషన్ సరఫరా చేయాలని డిమాండ్ చేసారు.

# ముస్లీంలు ఎంతో భక్తీ శ్రద్ధలతో వైభవంగా జరుపుకునే పండుగలలో బక్రీద్ పండుగ ఒకటి

**పొలాస నరేందర్ అధ్యక్షులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం**

నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి



బక్రీద్ పండుగ పర్వదినం శుభ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులంధరు బక్రీద్ పండుగను సుఖ సంతోషాలతో భక్తి శ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు పండుగను జరుపుకోవాలని కోరుకుంటూన్నానని నరేందర్ అన్నారు జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని పొలాస నరేందర్ అన్నారు.ఇస్లాం విశ్వాసానికి త్యాగానికి ప్రతీకంగా జరుపుకునే పర్వదినం బక్రీద్ పండుగ అని ఇట్టి బక్రీద్ పండుగ భక్తి విశ్వాసానికి ప్రతీక మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను సోదర భావాన్ని అందరు అనుసరించాలని ఆకాంక్షిస్తూ అందరి లో స్నేహబావాన్ని కలిగించాలని నరేందర్ కోరుకుంటున్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లిం సోదర సోదరీమణులంధరు బక్రీద్ పండుగను జరుపుకుంటారని పేదల పట్ల జాలి దయ కరుణ కలిగి ఉండడమే బక్రీద్ పండుగ పర్వదినం ఇచ్చే సందేశమని ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పొలాస నరేందర్ ఆకాంక్షించారు.

# షబ్బీర్ అలీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**ఘనంగా బక్రీద్ వేడుకలు...**


**కార్యకర్తలతో షబ్బీర్ అలీ నివాసం లో సందడి....**



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు లు షబ్బీర్ అలీ గారిని బక్రీద్ పర్వదినాన కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.కామారెడ్డి పట్టణ కేంద్రంలో శనివారం రోజునబక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ గారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావ్ , లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భగవంతుడు షబ్బీర్ అలీ గారికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వారు మరిన్ని ప్రజా సంక్షేమ పథకాలు తేవాలని వారి కోరికలు నెరవేరాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండ్ల రాజు, జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు ఐరేని సందీప్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్ బీసీ సెల్ అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ రామ గౌడ్, ఎర్రవాటి శ్యామ్ గౌడ్ కిరణ్.

# అడ్డు పుల్లలు వేయడం మాని అభివృద్ధి సూచనలు ఇస్తే బాగుంటుంది

**యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మండ సుమన్ గౌడ్**



ఎల్కతుర్తి జూన్07 నీలగిరి వార్త ప్రతినిధి

ఆడలేక మద్దెల దరువు అన్నట్టు తాను సరిగా పాట పాడలేక మద్దెలను బాగా వాయించలేదని నిందించాడు అంట ఎనకటికి ఒక వ్యక్తి ఈ యొక్క బిఆర్ఎస్ పార్టీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు తీరు అలానే ఉంది అని యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మండ సుమన్ గౌడ్ విలేకరుల సమావేశంలో అన్నాడు ఎల్కతుర్తి మండల సుందరీకరణ పనులు చూడలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులకు మతి భ్రమిస్తున్నట్టుంది ఇప్పుడే ఇలాగ ఉంటే ఇంకా ముందు రోజుల్లో మండల అభివృద్ధి మొత్తం చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిచ్చెక్కి రోడ్లపై తిరిగే పరిస్థితి ఏర్పడుతుందని మీ మాజీ ఎమ్మెల్యే లాగా కాళ్లు మొక్కిం చుకొనే తత్వం మా మంత్రిది కాదని కష్టంతో ఎవరొచ్చినా ఆదుకొని హత్తుకు చేర్చుకునే తత్వం మా బీసీ నాయకుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ అని 10 సంవత్సరాలు కాలయాపన చేసి ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్టు మండలాన్ని కూసింత అయిన అభివృద్ధి చేయని పరిస్థితి బిఆర్ఎస్ పార్టీ మీ మాజీ ఎమ్మెల్యేది ఎల్కతుర్తి మండలానికి బిఆర్ఎస్ పార్టీ మీయొక్క మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు ఎన్ని డబుల్ బెడ్ రూమ్ లు ఇచ్చాడు మరియు ఎంతమందికి దళిత బంధు ఇచ్చాడు కొంచమైనా సిగ్గుండాలి నిరుపేదలైన ఇల్లు లేని వారికి ఇందిరమ్మ పట్టాలు పంచుతుంటే అడ్డు పుల్లలు వేయడం మీ యొక్క విజ్ఞతకే వదిలేస్తున్నాం అయిన మండల ప్రజలు చూస్తున్నారు కచ్చితంగా స్థానిక ఎన్నికలలో వారు మీకు సమాధానం చెప్పే తీరుతారు ఇప్పటికైనా మండలంలో అభివృద్ధి పనులలో అడ్డు పుల్లలు వేయడం మాని అభివృద్ధికి సంబంధించిన సూచనలు ఇస్తే బాగుంటుంది కాదు కూడదు ఇలాగే అడ్డు పిల్లలు వేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిఎర్రోళ్ల చైతన్య మొలుగురి ప్రశాంత్ పాల్గొన్నారు.

# కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్య

మార్కాపురం జూన్ 7 నీలగిరి వార్త: ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున :



50 లక్షల రూపాయలుఅప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య శనివారం డిమాండ్ చేసారు. మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న రాజారపు పెద్ద ఎలమందయ్య గత పది సంవత్సరాల నుండి కౌలు రైతుగా వ్యవసాయం చేస్తూ తీవ్రమైన అప్పుల ఊబిలోకి కూరుకుపోయి గత నాలుగు సంవత్సరాల నుండి 6 ఎకరాల వరకు మిరప పంట సాగు చేయడంతో గిట్టుబాటు ధరలు లేక అప్పుల భారం పెరిగి ఈరోజు ఉదయం తన వ్యవసాయ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు ఎలమందయ్య కుటుంబానికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని,కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయ కులు దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. గడచిన సం వత్సరం ఆరు ఎకరాలలో మిరప పంట, రెండు ఎకరాలలో పొగాకు సాగు చేశారని ఫలితంగా ఒక్క సంవత్సరంలోనే 10 లక్షల పైగా అప్పు పేరుకుపోయిందని, మిరప పంటలో తీవ్ర నష్టం వాటిల్లడం వల్ల చేసిన అప్పు చెల్లించలేక పోవ డం వల్ల గత నాలుగు నెలల క్రితం ఎల్లమంద ఇంటి వద్ద అప్పుదారులు వచ్చి తీవ్రంగా ఒత్తిడి చేయడం జరిగిందని పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇక అప్పులు తీరే అవకాశం లేదని, పశువుల మేత కొరకు తన పొలంలో వేసిన పశువుల మేత కోసుకొని రావడం కొరకు వెళ్లి పురుగుల మందు సేవించి తనువు చాలించడం జరిగిందని,కుటుంబం వీధిన పడిందని వెంటనే కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని సోమయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్య చేసుకున్న రాజారపు ఎలమంద మృతదేహాన్ని రైతు సంఘం జిల్లా నాయ కులు దగ్గుపాటి సోమయ్య, గాలి వెంకటరామిరెడ్డి ,సిపిఎం మార్కాపురం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, సిపిఎం పట్టణ నాయకులు పందేటి రూబేను మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించడం జరిగింది.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.

# తప్పుడు పత్రాలతో కొట్నపల్లి నల్లరాయి క్వారీ తవ్వకాలు



**ఈ సమస్య ను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తా**

**జిల్లా ఎస్టీ ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు దేవదాసు**

అల్లూరి జిల్లా హుకుంపేట నీలగిరి వార్తా ప్రతినిధి

మండలంలో కొట్నాపల్లి పంచాయతీ పరిధిలో గల నల్ల రాయి క్వారీ భాధిత గ్రామాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు సందర్శించారు.ఈ సందర్భంగా వంతల దేవదాసు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా గిరిజనులకు జరిగే అన్యాయాలు, వారికున్న హక్కులకై పనిచేస్తూ ఉంటుందని పేర్కొన్నారు. భాధిత గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం అమాయక గిరిజన ప్రజలకు ఆసరాగా చేసుకొని తప్పు దారిలో అవసరమైన పత్రాలను సృష్టించి క్వారీ తవ్వకాలు నిర్వహించడం, భాది తులను భయభ్రాంతులకు గురి చేసినట్టు ఆరోపణలు వచ్చా యన్నారు.ఈ మేరకు గ్రామస్తులు వినతి పత్రం అంద జేసారు. భాదితుల ఇళ్లను పరిశీలించి, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.కమిటీ చైర్మన్ కలెక్టర్ కి సంప్ర దించి తగు చర్యలు జరిగే విధంగా, చట్టం ప్రకారం న్యా యం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొట్నపల్లి ఎంపీటీసీ ఎస్ బాలకృష్ణ , పెసా కమిటి ఉపాధ్యాక్షులు అప్పారావు,కార్యదర్శి ప్రసాద్,వార్డు మెంబర్లు ముత్యాలమ్మ పోతురాజు,గ్రామ పెద్దలు రామన్నదొర ,రాంబాబు,స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీ లలితా దేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పూజలు



నీలగిరి వార్త నారాయణఖేడ్ జూన్ 7 :

నారాయణఖేడ్ పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లలితాంబిక సహిత, శివ, గణపతి, సుబ్రమణ్య, శ్రీ చక్ర నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై మాజీ ఎమ్మెల్యే యం.భూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శనివారం ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు . వారితోపాటు మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ సర్పంచ్ సంగప్ప, మండల పార్టీ ఉపాధ్యక్షులు నర్సింలు యాదవ్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు నల్గొండ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోపాల్, మాజీ కో ఆప్షన్ సభ్యులు అంబదాస్,యువత అధ్యక్షులు మచ్చేందర్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాయి సంగమేశ్వర్ సెట్, తదితరులు ఉన్నారు.

# షబ్బీర్ అలీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మెడికల్ రాజ్



కామారెడ్డి పట్టణ కేంద్రంలో శనివారం రోజున బక్రీద్ పండగ సం దర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు. మాజీ ఎం పిటిసి తాటిమెడికల్ రాజు. వాటర్ సర్వీసింగ్ బైరయ్య యాదవ్. బిక్కనూర్ రమేష్ చారి. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న సేవలో సిద్ధార్థ్ ఎస్ జే డిఓపి ప్రియాంక వర్మ భూపతి రాజు దంపతులు



నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామివారిని శనివారం నాంది ఉగ్రం సినిమాల డిఓపి డైరెక్షన్ ఆఫ్ ఫోటోగ్రఫీ సిద్ధార్థ్ ఎస్ జే - ప్రియాంక వర్మ భూపతి రాజు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామి వారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకొని సేవలో తరించారు. అర్చకులు మామిడిపెల్లి శరత్ కుమార్ నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనంతో పాటు స్వామివారి తీర్థ ప్రసాదాలను అంద జేశారు. స్వామి వారి దర్శనం చాలా బాగా జరిగిందని, స్వామివారి కరుణ కటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మరిన్ని కొత్త ప్రాజెక్ట్స్‌తో మీ ముందుకు వస్తున్నట్లు చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామం తన సొంత ప్రాంతమని వెల్లడించారు చాలా సంతోషం అని తెలుపరు.

# పాడేరు పట్టణంలో వంద అడుగులు రోడ్డు విస్తరణ చేయాల్సిందే

**- రోడ్డు విస్తరణలో రాజకీయ ఎత్తుగడలు అవసరం లేదు,**

**- రాజకీయ ఒత్తిడితోనే కలెక్టర్ వెనకంజ,**

**- పని చేస్తే ప్రజల కోసం చేయండి,**

**- ఆదివాసి విలేకర్ల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు తాంగుల మహేశ్వరరావు,**

పాడేరు నీలగిరి వార్త ప్రతినిధి

పాడేరు జిల్లా కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో రాజకీయ ఎత్తుగడల కోసం మానుకోవాలని ఆదివాసి విలేకర్ల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు తాంగుల మహేశ్వరరావు తెలిపారు, గత నాలుగు రోజుల క్రితం కోర్టు ఆదేశాలతో కొన్ని దుకాణ సముదాయాలు జిల్లా కలెక్టర్ రెవిన్యూ, పంచాయితీ రోడ్ల భవనాల శాఖ,అధికారులతో హడావిడి చేసి తూతూ మంత్రంగా కొన్ని దుకాణాలను తొలగించారు, కొంతమంది అధికార ప్రజాప్రతినిధులు ఒత్తిడితో విస్తరణ పనులను కుదించి పనులు నిలుపుదల చేయడం సరికాదన్నారు, జిల్లా కేంద్రం కావడంతో ప్రజలు వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఎంతో ఇబ్బందులు గురవుతున్నారు, ఆదివాసి ప్రజలందరూ రహదారి విస్తరణ చేయాలని దపదపాలుగా కోరుతున్న అధికారపక్షం నాయకులు కొంతమంది గిరిజనేతురులతో ( వర్తక సంఘం ) కుమ్మకై ఏకంగా రహదారి విస్తరణ జరగకూడదని కుట్ర పన్నుతుండడం సరికాదన్నారు, గిరిజన ప్రాంతంలో సర్వం హక్కు ఆదివాసులకే ఉన్నప్పటికీ తోటి ఆదివాసి ప్రజాప్రతినిధులే గిరిజనేతరులకు కొమ్ముకాసి హక్కులను హరిస్తున్నారన్నారు, పాడేరు జిల్లా కేంద్రంలో రహదారి విస్తరణ జరిగితే ప్రజలందరికీ మేలు జరుగుతుందని అయితే కొంతమంది గిరిజనేతరులకు కొమ్ముకాసి వారి బాగోగుల కోసం నిత్యం వారికోసం జపం చేస్తున్నారన్నారు, పాడేరు పట్టణంలో ఇకపై రహదారి విస్తరణ పనులు జరిగినట్టైన అన్నా అనుమానాలు ఆదివాసీలకు తప్పడం లేదు, రాజకీయంగా పూర్తిస్థాయి అవగాహన లేక గిరిజన ప్రాంతంలో జరిగే అన్ని రకాల అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని ఆయన డిమాండ్ చేశారు, ఇప్పటికే జిల్లా కేంద్రం కావడంతో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుందని అత్యవసర సమయంలో అంబులెన్స్ వాహనాలకు కూడా దారి ఇవ్వని దుస్థితి నెలకొంటుందన్నారు, స్థానిక ప్రజలు కోరుకుంటున్నట్లుగానే రహదారికి ఇరువైపులా 50 అడుగుల చొప్పున 100 అడుగులు విస్తారణ పనులు నిర్వహించాలని, భవిష్య తరాలకు దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా నిలిపివేసిన విస్తరణ పనులను తక్షణం ప్రారంభించాలన్నారు, మొదట్లో హడావిడి చేసిన జిల్లా కలెక్టర్ యంత్రం ఇప్పుడు ఏమైందని ఆదివాసి ప్రజలందరూ ప్రశ్నిస్తున్నారన్నారు, గతంలోనే జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రతి శనివారం ఈ విస్తరణ పనుల్లో భాగంగా అక్రమాలను తొలగిస్తామని ప్రకటించి వాటిని ఆచరణలో తీసుకురాకపోవడం అస్పష్టంగా ఉందన్నారు, ఇప్పటికే పాడేరు జిల్లా కేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కేంద్రంలో భవిష్యత్తులో ట్రాఫిక్ నియంత్రించేందుకు ఈ విస్తరణ పనులు శ్రీకారం చుట్టిందని అయితే అవగాహన లేని అధికారపక్షం ప్రజాప్రతినిధులు దీనికి అడుగడుగునా అడ్డుపడుతూ గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నారన్నారు, రోడ్డు విస్తరణ పనులు జరిగితే గిరిజనేత్రులే తీవ్ర నష్టపోతారని చెప్పి పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తో పాటు మరి కొంత మంది వర్తక సంఘం నాయకులు భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి అమరావతి విశాఖ పట్నం ప్రధాన కేంద్రాల్లో ఉ న్న అధికార పక్షం నాయకులకు మంత్రులతో మంతనాలు జరిపించేందుకు పలుమార్లు వెళ్లిన సందర్భాలు ఉందన్నారు, ఏదైనా సరే విస్తరణ పనులు నిలుపుదల చేస్తామని లక్షల్లో డబ్బులు వసూలుకు పాల్పడ్డారని గిరిజన ప్రాంతంలో బహిరంగ ఈ వాదనలు వినిపిస్తుందనీ ఆయన అన్నారు, అన్ని రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి ఉద్యోగ ప్రజా సంఘాల అందరూ రహదారి విస్తరణ పనులు జరిగితేనే పాడేరు పట్టణం



అభివృద్ధికి సాధ్యపడుతుందని అన్ని రంగాలు మెరుగుపడేందుకు ఈ రహదారులే కీలకమవుతుందని భావిస్తుంటే అధికారపక్షం నాయకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ గిరిజనేతరులకు మద్దతుగా దొంగచాటున మంత్రులకు జిల్లా అధికారులకు కలిసి వినతి పత్రాలు సమర్పించుకుంటున్నారన్నారు, అధికార పక్షం నాయకులకు ఎంత ముడుపులు చెల్లించి ఉన్నారో వాటన్నింటికీ బహిర్గతం చేయాలన్నారు, ఈ రహదారి విస్తరణ పనులు నిలుపుదల చేస్తే భవిష్యత్తులో ఆదివాసి ప్రజలతో పాటు అన్ని రంగాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉ ందన్నారు, ఆదివాసి ప్రజా సంఘాలు మేధావులు ఇప్పటికైనా మేలుకోవాలని విస్తరణ పనులు నిలుపుదల చేయాలని ప్రయత్నం చేస్తున్న వారి భర్తం పట్టేందుకు అందరూ కదిలి రావాలన్నారు, జిల్లా కలెక్టర్ కూడా స్పందించాలని తొలగిస్తామని చెబుతూనే కాలయాపన చేయడం సరికాదన్నారు, పాడేరు పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న దుకాణాలు వివిధ వ్యాపార సముదాయాలను తొలగించకపోతే భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజల విశ్వాసం కోల్పోవడంతోనే ఓటమిపాలైన రోహిత్ రెడ్డి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ బాల్ రెడ్డి.**



తాండూరు / జూన్ 7: ప్రజల విశ్వాసం కోల్పోవడంతోనే మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఓటమిపాలైయ్యారని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ బాల్ రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా న్యూస్ కవరేజ్ తో ప్రజల మెప్పు కోసం ప్రయత్నాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.తను ఎమ్మెల్యేగా ఉన్నపుడే అభివృద్ధి జరిగిందని, ఎక్కడా చూసి తన అనవాళ్ళు కనిపించే విధంగా ఉందని న్యూస్ పేపర్లలో రాయడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి రోహిత్ రెడ్డి ఉన్నాపుడే జరుగితే,5 సంవత్సరాలలో కేవలం జీ.వోలు , శిలాఫలకలకే ఎందుకు పరిమితం అయ్యిందని ప్రశ్నించారు. అలాగే ఇండస్ట్రియల్ పార్క్ పనులు ఎందుకు ప్రారంభించలేదు, మార్కెట్ యార్డ్ జాడనే లేదని, నర్సింగ్ కాలేజ్ , బషీరాబాద్ ఇంటర్ కాలేజ్ లలో తరగతులు ఎందుకు ప్రారంభించలేదు, కనీసం ఫ్యాకల్టీ ని నియమించలన్న ద్యాస కూడా గతంలో ఉన్న ఎమ్మెల్యే కు లేదని, అన్నింటికీ మించి చిలుక వాగు,గొల్ల చెరువు, తాండూరు నుంచి హైదరాబాద్ రోడ్ పనులు బ్రహ్మాండంగా సాగుతున్నాయని , కోట్ పల్లి,జుంటుపల్లి మరమత్తులకు నిధులు మంజూరు చేయడం ఇలా విద్య వైద్యం, రవాణతో అభివృద్ధి అన్ని విధాలుగా మనోహర్ రెడ్డి అభివృద్ధికి ఓర్వలేక తప్పుడు రాతలు రాయించాడం మంచిది కాదని విమర్శించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఆర్ సి గౌడ్



తాండూరు / జూన్ 7 : మృతుని కుటుంబానికి తాండూర్ మండల బీ.ఆర్.ఎస్ పార్టీ బీ.సి సెల్ అధ్యక్షుడు ఆర్.సి గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సుమన్ ప్రమాదవశాత్తు రైల్వే ప్రమాదంలో మృతిచెందినారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తాండూర్ మండల బీ.ఆర్.ఎస్ పార్టీ బీ.సి సెల్ అధ్యక్షుడు ఆర్.సి గౌడ్ తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని పోస్టుమార్టం తరువాత వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సుమన్ అంత్యక్రియలకు ఆర్థిక సహాయంగా 5000/- రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామ ఘనికార్మికా సంఘం అధ్యక్షుడు ఎస్.పండరి , గ్రామ పెద్దలు, యువ నాయకులు ,ఆర్.సీ గౌడ్ యువసేన సభ్యులు పాల్గొనడం జరిగింది.

## త్యాగం, భక్తి ,సహనంలకు ప్రతీక బక్రీద్ పండుగ

**- ప్రభుత్వ చీఫ్ వీఫ్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, నేతలు**





తాండూరు / జూన్ 7 : త్యాగం, భక్తి ,సహనం లకు ప్రతీక బక్రీద్ పండుగ అని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ వీఫ్ మహేందర్ రెడ్డి , తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరు సమీపంలోని పలు ఈద్గా లలో బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ కుల మత బేధాలు లేకుండా అందరు సోదర భావంతో నడుచుకోవాలని అన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలకు, ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపారు .ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్ ,డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, నాయకులు ధారాసింగ్, కరణం పురుషోత్తంరావు, అబ్దుల్ రవూఫ్, అబీబ్ లాల, అప్పూ ,ఈద్గాకమిటి చైర్మన్ యూసుఫ్ ఖాన్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పట్టణ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ





కామారెడ్డి పట్టణం లోని కోర్ట్ ఆవరణలో గల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ చేసి అందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ .

## ఘనంగా పైలట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఘనంగా జరుపుకున్న బి ఆర్ ఎస్ నాయకులు**





నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

నేడు తాండూరు మాజీ శాసనసభ్యులు ,పైలెట్ రోహిత్ రెడ్డి గారి జన్మదిన వేడుకల్ని వికారాబాద్లో ఘనంగా నిర్వహించడం జరిగింది. రోహిత్ రెడ్డి జన్మదిన సం దర్భంగా వికారాబాద్లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అనంతగిరి అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో వికారాబాద్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు యంగ్ లీడర్స్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, నిఖిల్ కిషోర్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టైగర్ కృష్ణయ్య. టిఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు ఉంగురు. కృష్ణల ఆధ్వర్యంలో అనంతగిరిలో కేక్ కట్ చేయడం జరిగింది., దేవాలయంలో పూజారులు వేధ ఆశీర్వచనం, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోహిత్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున హాజరై , రోహిత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాదిరెడ్డిపల్లి మాజీ ఎంపిటిసి, ఏం.విజయ్ కుమార్, మాదిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్, భూమోల. స్టాలిన్ తేజ, బాలవర్ధన్ రెడ్డి, జగన్, ప్రవీణ్ , రిషి, సుభాన్ రెడ్డి, గయాజ్, తిరుమలేష్ ,బందెయ్య, రవి, ఖలీల్, సోహెల్, హుబేద్, రోహిత్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## మహిళా సబ్ ఇన్ స్పెక్టర్ పై కాంగ్రెస్ నాయకుడి దాడి

**కాంగ్రెస్ నాయకుడు,అనుచరులు**

**పోలీసులఅదుపులో!కేసు నమోదు**

**మద్యం మత్తులో హోటల్ సిబ్బంది తో గొడవ**

**హోటల్ పై దాడి**



ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త

ఖమ్మం కల్లూరు ఎన్ ఎస్పీ క్యాంపు ఏరియాలో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్తత వాతావరణం చోటు చేసు కుంది, తల్లాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రాయల రాము అనే వ్యక్తి మద్యం మత్తులో పరోట విషయంలో హోటల్ సిబ్బందితో గొడవపడ్డాడు దీంతో మహిళ ఎస్సై కాంగ్రెస్ నాయకుడి చెంప చెల్లుమనిపించడంతో అదే స్థాయిలో మహిళ ఎస్సైపై కూడా కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది.

విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఎస్ ఐ పై కాంగ్రెస్ నాయకుడు దాడికి పాల్పడ్డ ఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణంలో చోటుచేసు కుంది. తల్లాడ మండలానికి చెందిన రాయల రాము అనే యువ కాంగ్రెస్ నాయ కుడు తన అనుచరులతో కలిసి కల్లూరు ఎన్ ఎస్ పి సెంటర్లో ఉన్న చౌదరి హోటల్ కు వెళ్లి తినటానికి అర్డర్ ఇచ్చారు.వాళ్ళు ఇచ్చిన అర్డర్ లేదని చెప్పటంతో హోటల్ యజ మాని, సిబ్బందిపై వాగ్వాదా నికి దిగారు సదరు వ్యక్తులు. ఇరురుపక్షాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. రాము అంతటితో ఆగకుండా తన అనుచరు లతో కలిసి హోటల్పై దాడికి పాల్పడడంతో హోటల్ నిర్వాహకుడు కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంటనే ఎస్ఐ హరిత సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గొడవను నిలువరించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో మహిళా ఎస్సై హరిత, రాముకు మధ్య వాగ్వాదం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సై పట్ల రాము దురుసుగా ప్రవర్తించడంతో ఎస్సై రాము చెంప చెల్లు మనేలా కొట్టింది. దీనితో రాము కూడా ఎస్ఐ పై దాడికి పాల్పడ్డారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారిం ది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింటా వైరల్ గా మారింది. కల్లూరు పోలీసులు రాముతో పాటు వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రీట్ మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తన అనుచరులు ఆరుగురుని అదుపులోకి తీసుకొనివారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## వనస్థలిపురంలో ఘనంగా టైం ఫోర్ టీ స్టాల్ ప్రారంభం



వనస్థలి పురం నీలగిరి వార్త (జూన్ 7): వనస్థలిపురం సుష్మ థియేటర్ చౌరస్తా విజయవాడ జాతీయ రహదారి ప్రగ్మా హాస్పిటల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టైం ఫోర్ టీ స్టాల్ స్టాల్ ను శనివారం బి ఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనస్థలి పురం పరిసర ప్రాంతాల కాలనీ వాసులకు అతి చెరవలో ఉండే విధంగా టైం ఫోర్ టీ స్టాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కస్టమర్లు మంచి నాణ్యమైన టీ మరియు స్నాక్స్ అందించి వారి మన్నలను పొంది దిన దిన అభివృద్ధి చెంది మరిన్ని ఏర్పాటు చేయాలని అకాక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకర్, రవి శంకర్,



శివాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కొండోజు శ్రీనివాస చారి, కూరెళ్ల వేములయ్య గౌడ్, దేరంగుల కృష్ణ, మరియు భరత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు





తాండూరు / జూన్ 7 : తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం తాండూరులోని ఆయన నివాసంలో కేక్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా జిల్లా ఆస్పత్రిలో మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్ల పంపిణి అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్వీ, రోహితన్న యువసేన సభ్యులు రక్తందానం చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్యకు సన్మానం



నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి

చందుర్తి ఎస్ఐగా పనిచేసే వేములవాడ రూరల్ ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై బి.అంజయ్యను శనివారం చందుర్తి మాజీ జెడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇందూరి మధులు వేములవాడ లొ శాలువాతో సన్మానించారు చందుర్తి మండలంలో ఆరు మాసాలు ఎస్సైగా పనిచేసే శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరుణ్ తేజ చారి ఉన్నారు.

## అక్రమంగా కోడెలను తరలించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి



నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి

వేములవాడలో గోవదశాలలు మూసివేయాలి: హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..

వేములవాడ పట్టణంలో గోవదశాలకు అక్రమంగా కోడెలను తరలించిన విషయంలో చట్ట ప్రకారం కేవలం రెండు కోడెలను మాత్రమే నిన్నటి రోజున కాపాడుకోవడం జరిగిందనీ, మిగిలిన నాలుగు కోడెల విషయంలో పూర్తిగా అక్రమ రవాణా జరిగిందని గోవదశాలకు కోడెలు తెచ్చిన వ్యక్తులపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలను తీసుకోవాలని పవిత్రమైన వేములవాడ పుణ్యక్షేత్రంలో గోవధశాలలు మూసి వేయాలని వేములవాడ పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడాలని హిందూ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో రేగుల సంతోష్ బాబు గడప కిషోర్ రావు నాగుల రాములు గౌడ్ రేగుల రాజ్ కుమార్ మెరుగు లక్ష్మణ్ మైలారం శ్రీనివాస్ నందగిరి రాహుల్ కోరెపు వెంకటేష్ చిలువేరి పరుశరాం బండి నరేష్,కిరణ్ హిందూ సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సాగుతున్న మన ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన

**బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్**

వరంగల్ సిటీ నీలగిరి వార్త.

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ సూచనల మేరకు శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ అధ్యక్షతన శనివారం శివనగర్లోని ఓ పాఠశాల నందు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన సందర్బంగా కార్యశాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ అనే ధ్యేయంతో ఎన్నో సంస్కరణలు, అభివ్రుది కార్యక్రమాలు జరిగాయి. దేశానికి సేవ చేయడమే మన పార్టీ లక్ష్యం. ఈ పదకొండు సంవత్సరాలలో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పాలన,పారదర్శకత మరియు ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృశ్య 11 సంవత్సరాల మోడీ పాలనలో ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివ్రుది పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్నవే అందులో గ్రామాల్లోని నర్సరీ చెట్లు, స్మశాన వాటిక, క్రీడా ప్రాంగణ, రేషన్ బియ్యం, విధి రోడ్లు, విధి లైట్ లు, అంగన్వాడీ పోషక ఆహార సప్లయ్, జీరో అకౌంట్లు(బ్యాంక్ అకౌంట్), ఉజ్వల్ యోజన (గ్యాస్), మహిళల ఆత్మ గౌరవం కొరకు టాయిలెట్ నిర్మాణం, చిరు, మధ్యతర వ్యాపారులకు ముద్ర లోన్స్, జలజీవన్ క్రింద ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి, రైతులకు సబ్సిడీలు, ఎరువుల సబ్సిడీ, పంట మద్దతు ధర, అకాల వర్షాలకు పంట నష్టపోతే ఫసల్ భీమా యోజన ద్వారా రైతుకి పరిహారం, డబుల్ బెడ్ రూమ్లకు ఆవాస్ యోజన, బడి బాట కార్యక్రమాలు, డ్వాక్రా గ్రూప్లకు సబ్సిడీ లోన్స్ వంటివి ప్రజలు లబ్ధి పొందుతున్నారు.పట్టణ ప్రాంతంలోని హైవే రోడ్లు, సూపర్స్పెషలిటీ హాస్పిటల్స్, రైల్వే పునరుద్ధరణ, నూతన విమానాశ్రయ నిర్మాణాలు, స్మార్ట్ సిటీ, డిజిటల్ ఇండియా,మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్, అమృత్ సిటీ క్రింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ముద్ర లోన్స్, గర్భిణీ స్త్రీలకు పోష్టిక ఆహారం, భేటీ పడవో భేటీ బచావో, సుకన్య సంవృది యోజన, జన్ ధన్ ఖాతాలు, పోస్ట్ ఆఫీస్ లో స్కీమ్స్, ప్రసాదం స్కీం తో ఆలయాల అభివ్రుది, స్టార్ట్ అప్ లకు సహకారం, వెనుకబడిన బీసీ, ఎస్సీ, యస్.టీ, మైనారిటీ పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు స్కాలర్ షిప్ లు, పల్లె, పట్టణ ప్రాంతంలోని హెల్త్ సెంటర్ హాస్పిటల్ కొరకు నిధులు కేటాయింపు, పార్కుల నిర్మాణం మొదలకు కార్యక్రమాలు జరుగుతున్నవి. ఈ యొక్క విషయాలను ప్రతి బూత్ స్థాయి కార్యకర్త ప్రజలకు తెలియజేయాలి అని కోరడం జరిగింది. కరోనా లాంటి కష్ట సమయంలో జనాభా పరంగా అతిపెద్ద దేశమైన భారత్ లో ఉన్న ప్రజలకు ఉచిత కరోనా వాక్సిన్ అందించి కాపాడుకున్న వ్యక్తి నరేంద్ర మోడీ గారు, దేశ అభివృధికి అడ్డుకులైన ఉగ్రవాద నక్సలైట్ లను మట్టు పెడుతూ ప్రజల మన్ననలను అందుకుంటున్నారు. నిన్నగాక మొన్న కాశ్మీర్లో జరిగిన ఉగ్రవదా చర్యలకు భారత్ అనుకుంటే ఏం చేయ గలదో కేవలం 20 నిమిషాల్లో పాకిస్తాన్ కు,భారత సైన్యం తో పెట్టుకుంటే ఏం అవుతుందో తెలియజేసారు మోడీ .

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బి. ఆర్. ఎస్ పార్టీ ఓట్లు పడేలా లేదు, అవినీతి ఆరోపణలు ఎదురుకోవడం వల్ల ప్రజలు వారిని గద్దె దింపడం జరిగింది. అలాగే ప్రజా ధనాన్ని లెక్క లేకుండా ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారు. అందుకే మాటల గారడీ పిట్టల దొర కేసిఆర్ మాటలు ప్రజలు గ్రహించి కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించారు. అలవి గానీ హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్, హామీలు నిలబెట్టుకోవడంలో విఫలం అయింది. ప్రజా పాలన అంటూనే ప్రజలను ఇబ్బంది పెట్టేలా పరిపాల కొనసాగిస్తుండటం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఎదురుకుంటుంది. ప్రజలు ప్రతి పార్టీకి తెలంగాణలో అధికారం అందించింది వారీ పరిపాలన చూశారు ఈసారి ప్రజలు అంత బీజేపీ వైపు ఉన్నారు రాబోవు



రోజుల్లో ప్రజల ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృశ్య మోడీ చేస్తున్న అభివ్రుది పనులు గ్రామస్థాయి ప్రజల్లోకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్త కంకణ బద్ధులుగా తీసుకోవాలని కోరారు. అదేవిదంగా ఈ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పార్టీలకతీతంగా ప్రజల మధ్యలో నిర్వహించుకోవాలని సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ గారు, జిల్లా అధికార ప్రతినిధి ఆడేపు వెంకటేష్ , జిల్లా ప్రచార కార్యదర్శి బైరి శ్యామ్ సుందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉషారాణి , వరంగల్ జిల్లా ఆటో యునియన్ కన్వీనర్ సుంచు కేశవ్, ప్రోగ్రామ్ కన్వినర్ జోగు మధు కుమార్, కో కన్వీనర్ బోడకుంట్ల శివ, జనరల్ సెక్రెటరీ సురా శ్రీనివాస్, వైట్ల గణేష్, మండల కమిటీ సభ్యులు, శక్తి కేంద్రం ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

